

హక్కులను కాలరాయొద్దు

కార్మిక వ్యతిరేక నిర్ణయాలు సరికాదని సీఐటీయూ నేతలు అన్నారు. హక్కులను కాలరాయొద్దని పేర్కొన్నారు. 8లో▸



యూరియా ఇవ్వండి

రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య డిమాండ్ చేశారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. 8లో▸

కాటేస్తున్న కరెంట్!

విద్యుత్ స్తంభాలపై విగతజీవుల్లా..

- ఎల్సీ తీసుకున్నా.. రివర్స్ సరఫరా
- అవగాహన లేక కొందరు.. అతి విశ్వాసంతో మరికొందరు
- మృత్యువాత పడుతున్న ఆర్టిజన్లు

సాక్షి, రంగారెడ్డి: ఎల్సీ (లోడ్ రిలీఫ్) తీసుకున్నామనే ధీమా.. అతి విశ్వాసం.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం.. వెరసి కార్మికులు తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. వినియోగదారుల ఇళ్లలో వెలుగులు నింపుతూ.. వారి కుటుంబాల్లో మాత్రం చీకట్లు మిగుల్చుతున్నారు. విద్యుత్ స్తంభం ఎక్కే ముందు కరెంట్ ఉందో? లేదో ఎర్తింగ్ రాడ్‌తో చెక్ చేసుకోవాలని విద్యుత్ శాఖ సూచిస్తున్నా.. క్షేత్రస్థాయిలోని కార్మికులు కనీస జాగ్రత్తలు తీసుకోకుండానే స్తంభాలు ఎక్కేస్తున్నారు. ఫలితంగా వినియోగదారుల ఇళ్లలోని ఇన్వెర్టర్లు, జనరేటర్ల నుంచి కరెంట్ రివర్స్ సప్లయ్ అవుతుండటంతో విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాతపడుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఆర్టిజన్లు మృత్యువాత పడ్డారు.

లైన్ల నిర్వహణలో కీలకం

విద్యుత్ లైన్ల నిర్వహణ, కనెక్షన్ల జారీ, సరఫరా, బిల్లుల జారీ, వంటి పనుల్లో ఆర్టిజన్లే కీలకం. డిస్కం పరిధిలో 23 వేల మంది ఆర్టిజన్లు పని చేస్తున్నారు. వీరిలో గ్రేటర్ పరిధిలోని 6,500–7000 మంది కార్మికులు పని చేస్తున్నారు. విద్యుత్ లైన్ల నిర్వహణలో ఆర్టిజన్లదే కీలక పాత్ర. కొత్త లైన్లు వేయడం, విద్యుత్ స్తంభాలు పాతించడం, పాడైన వాటిని గుర్తించి వాటి స్థానంలో కొత్తవి అమర్చడం, లూజైన లైన్లు గుర్తించి సరి చేయడం, కనెక్షన్లు ఇచ్చి మీటర్లు అమర్చడం, హెచ్చుతగ్గుల సమస్యను నివారించడం, కాలిపోయిన ఫీజులను సరి చేసి విద్యుత్‌ను పునరుద్ధరించడం, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వంటి కీలక పనులు వీరే చేయాల్సి ఉంటుంది.



కనీస జాగ్రత్తలు తీసుకోకుండా..

లైన్ల కింద పని చేసేవారు విధిగా తలకు హెల్మెట్, చేతులకు గ్లౌస్‌లు ధరించాలి. స్తంభాలపైకి ఎక్కినప్పుడు విధిగా నడుముకు సేఫ్టీ తాడు బిగించుకోవాలి. తీగలను తాకడానికి ముందే ఎర్త్‌రాడ్, టెస్టర్‌తో కరెంట్ సరఫరా ఉందో లేదో చెక్ చేసుకోవాలి. లైన్లకు ఇరు వైపులా ఏమైనా అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సంస్థలు ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలి. కరెంట్ సరఫరా అవుతున్న ఫీడర్, డీటీఆర్‌ను గుర్తించి వాటిపై సరఫరా నిలిపివేయాలి. ఇవేవీ పట్టించుకోకుండా అతి విశ్వాసంతో స్తంభాలు ఎక్కి ప్రాణాల మీదికి తెచ్చుకోవడం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సేఫ్టీ టూల్స్ అందజేయాల్సి ఉన్నా డిస్కం పరిధిలోని కార్మికులకు కనీసం టెస్టర్ కూడా సరఫరా చేయడం లేదనే విమర్శలు లేకపోలేదు.

కొన్ని ప్రమాద ఘటనలు

- శంషాబాద్ మండలం సంఘీగూడ చౌరస్తాలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ఆర్టిజన్ అనిల్‌కుమార్ స్తంభాన్ని ఎక్కాడు. ఎల్సీ తీసుకున్నాడు. తీరా స్తంభం ఎక్కిన తర్వాత పవర్ రివర్స్‌తో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.
- కందుకూరు మండలం సాయిరెడ్డిపల్లె సమీపంలోని అమ్మాలబావి తండా పొలాల వద్ద కరెంట్ సరఫరా నిలిచిపోయింది. లైన్‌మెన్ వెంకటయ్య, ముచ్చర్లకు చెందిన ఒప్పంద కార్మికుడు శివకుమార్‌గౌడ్(24)తో కలిసి అక్కడికి వెళ్లి 20 నిమిషాల్లో లైన్లకు మరమ్మతులు పూర్తి చేశారు. తర్వాత విద్యుత్ సరఫరా నిలిపివేసిన జంపర్లను కలిపేందుకు మరో స్తంభం వద్దకు వెళ్లారు. ఎల్సీ తీసుకునేందుకు సబ్‌స్టేషన్‌లోని సిబ్బందితో లైన్‌మెన్ వెంకటయ్య ఫోన్‌లో మాట్లాడుతుండగానే శివకుమార్ స్తంభంపైకి ఎక్కడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అంతలోని సరఫరా నిలిచిపోవడంతో గాయాలపాలైన శివకుమార్ వైర్లమధ్యే చిక్కుకుని విలవిల్లాడాడు. సమీపంలో ఉన్న రైతులు తాళ్ల సాయంతో స్తంభంపై నుంచి కిందికి దించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.
- ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం వద్ద విద్యుత్ స్తంభంపై సాంకేతిక సమస్య తలెత్తింది. నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు జూనియర్ లైన్‌మెన్ రవికుమార్ సహా ఆర్టిజన్ బొమ్మ అశోక్‌కుమార్ వెళ్లి స్తంభంపైకి ఎక్కి లైన్లు సరి చేస్తుండగా, ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అవగాహన లేకే..

కార్మికుల భద్రత యాజమాన్యానికి పట్టడం లేదు. 80 శాతం కార్మికుల వద్ద ఎలాంటి సేఫ్టీ టూల్స్ లేవు. ఉన్నవి సైతం పాడైపోయాయి. క్షేత్రస్థాయి కార్మికులకు ఏటా సేఫ్టీటూల్స్ అందిస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. ఫీడర్లు, లైన్లపై చాలా మందికి కనీస అవగాహన ఉండటం లేదు. పవర్ రివర్సన్‌తో కార్మికులు షాక్‌కు గురవుతున్నారు.

– గాంబో నాగరాజు, విద్యుత్ కార్మిక సంఘం నాయకుడు



బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

ఇబ్బందులు రానీయొద్దు

- నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయండి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గణేశ్ నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనివ్వొద్దని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌ను జీహెచ్‌ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. రూట్ మ్యాప్ ఆధారంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నిమజ్జనం సాఫీగా సాగేలా చూడాలని, అవసరమైన చోట బారికేడ్లను ఏర్పాటు చేసుకోవాలని పోలీసు శాఖకు సూచించారు. భారీ గణనాథులు నిమజ్జనం చేసే చోట అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనం పూర్తయే వరకు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. చెరువు కట్టపై వైద్య శిబిరాలతో పాటు అత్యవసర పరిస్థితి దృష్ట్యా అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. చెరువుకట్టపై పారిశుద్ధ్య సమస్య రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ బాలాపూర్ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ సమితి ప్రతినిధులు కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రసాదం అందజేశారు. కలెక్టర్ వెంట ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, కందుకూరు ఆర్డీఓ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సామగ్రి ధరలు పెంచితే కఠిన చర్యలు

ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేసే ఇసుక, ఇటుక, సిమెంట్ ధరలపై నియంత్రణ ఉంచాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఆయా ట్రేడర్స్‌తో మాట్లాడి ధరలు అదుపులో ఉండేలా చూడాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలు పెంచే వ్యాపారులతో కఠినంగా వ్యవహరించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ధరల నియంత్రణ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఇంటికి కావాల్సిన ఇసుకను మన ఇసుక మన వాహనం ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎప్పటికప్పుడు తమ ఇంటి నిర్మాణ పనుల దశలను ఆన్‌లైన్ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు బిల్లుల చెల్లింపు ఏ దశలో ఉందో కూడా తెలుసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

యువత క్రీడల్లో రాణించాలి



విజేతకు బహుమతులు అందజేస్తున్న పుల్లెల గోపీచంద్

నందిగామ: విద్యార్థులు, యువత తమకు ఇష్టమైన క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రపంచ స్థాయిలో రాణించాలని బ్యాడ్మింటన్ నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని కన్హా శాంతివనంలోని గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో బీఏటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోనెక్స్ సన్‌రైజ్ 79వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్–2025 రెండో రోజైన బుధవారం జూనియర్స్ విభాగంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత క్రమ శిక్షణతో సాధన చేయాలని, ఎక్కడ పొరపాటు చేస్తున్నామో గ్రహించి మరోసారి అలాంటి పొరపాటు చేయకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల క్రీడాకారులు, కన్హా శాంతివనం ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా

షాద్‌నగర్: ఆర్యవైశ్య సంఘం నాయకులు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఈ పుస్తకాలను బుధవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులను విద్యలో ప్రోత్సహించడంలో భాగంగా దాతల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 25వేల నోటు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గందె సురేష్, నాయకులు గణేశ్‌గుప్తా, రవికుమార్‌గుప్తా, లక్ష్మయ్య, రమాదేవి, బెజుగం రమేష్, బండారి రమేష్, మురళి, ఎల్కుర్తి జగదీశ్వర్‌గుప్తా, బద్రీనాథ్, దండు రాహుల్, నీల రవీందర్, మురళీగుప్తా, శంకర్, యశ్వంత్, మలిపెద్ది శ్రీనివాసులు, పోల శశిధర్, యంసాని శ్రీనివాసులు, త్రినాథ్, నంద కిషోర్, తాటి విజయ్, రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏర్పాట్ల పరిశీలన



విద్యుత్ అధికారులను సన్మానించిన బాలాపూర్ ఉత్సవ సమితి నిర్వాహకులు

బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని విద్యుత్ ఏర్పాట్లను బుధవారం అధికారులు పరిశీలించారు. టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు, జిల్లా జోన్ చీఫ్ ఇంజనీర్ పాండ్య పరిశీలించారు. ఉత్సవ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం రోజు శోభయాత్రకు తరలించే గణనాథుని వాహనం వెళ్లే దారి పొడవునా ప్రమాదాలు జరుగకుండా, విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ సిబ్బందికి వారు ఆదేశాలు జారీ చేశారు. వీరి వెంట రాజేంద్రనగర్ ఎస్ఈ శ్రీరామ్‌మోహన్, కందుకూర్ డీఈ గోపాలకృష్ణ, మామిడిపల్లి ఏడీఈ శంకర్ తదితరులు ఉన్నారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, సమితి నిర్వాహకులు విద్యుత్ అధికారులను సన్మానించారు.

నేటి అర్ధరాత్రి వరకే 'మహా' దర్శనం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహా వినాయకుడి దర్శనానికి గురువారం అర్ధరాత్రి వరకే అనుమతి ఉంటుందని, తర్వాత భక్తుల దర్శనాలు నిలిపివేస్తామని నిర్వాహకులు తెలిపారు. శనివారం మహా వినాయకుడి నిమజ్జనం సందర్భంగా షెడ్డు తొలగింపు పనులు, క్రేన్ ఏర్పాట్ల కారణంగా శుక్ర, సర్వదర్శనాలకు అవకాశం ఉండదు. భక్తులు గమనించి నిర్వాహకులకు, పోలీసులకు సహకరించాలని కోరారు.

18న బాచుపల్లి ప్లాట్ల ఈ-వేలం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) బాచుపల్లి లే అవుట్‌లోని 70 ఖాళీ ప్లాట్లకు ఈ నెల 18న ఈ–వేలం వేయనుంది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం లే అవుట్‌లో ప్రీబిడ్ మీటింగ్ నిర్వహించింది. ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి వేలంపాట ప్రక్రియ గురించి వివరించారు. ఎంఎస్‌టీఎస్ ప్రతినిధులు ఈ–వేలం పాట విధానం గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. కేపీఎంజీ ప్రతినిధులు ఈ ప్రాంతంలోని వ్యూహాత్మక ప్రాధాన్యతలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్నవారి నుంచి వచ్చిన సందేహాలకు ఆయా విభాగాల అధికారులు నివృత్తి చేశారు. సమావేశంలో హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యప్రసాద్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కవిత వ్యాఖ్యలతో బీఆర్‌ఎస్‌లో సంక్షోభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలతో బీఆర్‌ఎస్ సంక్షోభంలో కూరుకుపోయిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన నేతలు కవిత మాటలతో మట్టి కొట్టుకుపోయే సమయం ఆసన్నమైందని తెలిపారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం సాగు, తాగునీటి కోసం ప్రాజెక్టులను నిర్మించిందన్నారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వేలాది కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని స్వయానా కేసీఆర్ కూతురే చెప్పడాన్ని బీఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదన్నారు. ఆ పార్టీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరంపై జరిగిన అవినీతిని జస్టిస్ ఘోష్ కమిషన్ వెల్లడించిందని స్పష్టంచేశారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే బీఆర్‌ఎస్ ఆందోళనలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని, నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పదేళ్లు అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్ కవిత దెబ్బతో సంక్షోభంలో చిక్కుకుందన్నారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు చేసిన అవినీతిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఇబ్రహీం, శ్రీను, వీరేశం, సుదర్శన్, అశోక్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి సురేశ్

ఆమనగల్లు: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి సురేశ్ అన్నారు. పంటను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందని చెప్పారు. ఆకుతోటపల్లి గ్రామంలోని రైతువేదికలో బుధవారం జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మొక్కలకు 90 శాతం, డ్రిప్ ఇరిగేషన్‌కు 80 శాతం రాయితీ ఉందన్నారు. పంట సాగుచేసిన రైతులకు ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు అందించడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించడానికి వ్యాల్యూ ఆయిల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుందని, సదరు కంపెనీ రైతుల నుంచి కొనుగోలు చేస్తుందని ఆయన వెల్లడించారు. పంటకు కోతుల బెడద ఉండదని, కూలీల అవసరం కూడా తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం రైతులకు ఆయిల్‌కంపెనీతో కుదుర్చుకున్న కొనుగోలు ఒప్పంద పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య, ఆయిల్ పాం ఏరియా మేనేజర్ ప్రమోద్, హెచ్ఈఓ శ్రవణ్‌కుమార్, ఏఈఓ భూదేవి పాల్గొన్నారు.



రైతులకు కొనుగోలు ఒప్పంద పత్రాలను అందిస్తున్న సురేశ్



యాచారం: పీఏసీఎస్‌కు తరలివచ్చిన రైతులు



షాబాద్: పీఏసీఎస్ వద్ద అన్నదాతల క్యూ

యూరియా కష్టాలు

యాచారం: యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. లైన్‌లో లేకపోతే దొరుకుతుందో.. లేదోనన్న ఆందోళనతో ఉదయాన్నే తమ చెప్పులను క్యూలైన్‌లో పెట్టి కొందరు.. వ్యవసాయ పనులు చూసుకుని వస్తుండగా హోటళ్ల వద్దే మొహం కడుక్కుని, టిఫిన్ చేసి వేచి ఉంటున్నారు. యాచారం పీఏసీఎస్‌కు బుధవారం 450 బస్తాల యూరియా వచ్చింది. రైతులు 800 మందికి పైగా తరలివచ్చారు. రైతుల వాహనాలతో నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ట్రాఫిక్ జాం అయింది. రైతులను సముదాయించడం అటు పీఏసీఎస్ సిబ్బందికి, ఇటు పోలీసులకు కష్టంగా మారింది. చివరికి టోకెన్లు ఇప్పించి 450 మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున అందజేశారు. టోకెన్లు పొందిన మిగతా రైతులకు రెండు రోజుల్లో అందేలా చూస్తామని మండల వ్యవసాయాధికారి రవినాథ్ నచ్చజెప్పారు.

బస్తాల కోసం బారులు

షాబాద్: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ఎదుట బుధవారం ఉదయాన్నే యూరియా కోసం బారులు తీరారు. 400 బస్తాలు రాగా ఉదయం నుంచే క్యూలో వేచిఉండి కొనుగోలు చేసి తీసుకెళ్లారు. రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు. మిగతా వారికి మళ్లీ రాగానే పంపిణీ జరిగేలా చూస్తామని పోలీసులు నచ్చజెప్పి పంపించారు.

ఆసరా.. అంతేనా!

- జాడలేని కొత్త పింఛన్లు
- అర్హుల ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కేశంపేట: ఆసరా పింఛన్లు కొత్తగా మంజూరు కాకపోవడంతో అర్హులైనవారు ఆశగా ఎదురుచూస్తున్నారు. నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ హయాం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అర్హులకు నూతనంగా మంజూరు చేయలేదు. దీంతో గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులకు నిరీక్షణ తప్పడం లేదు.

కార్యాలయాల చుట్టూ చక్కర్లు

వృద్ధాప్యంలో ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ వస్తే భరోసాతో బతకొచ్చని వృద్ధులు భావిస్తున్నారు. అలాగే ఇంటి పెద్దలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వితంతు మహిళలు ఈ సహాయంతో కుటుంబాన్ని పోషించుకోవచ్చని, ఒంటరి మహిళలు ఎవరిపై ఆధారపడకుండా జీవించొచ్చని కొత్త పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో అర్హులైన వారు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులు తీసుకొని తిరుగుతున్నారు.



స్పష్టత కరువు

కొత్తగా మంజూరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలో 57 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి వృద్ధాప్య పింఛన్ల మంజూరు కోసం మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, విచారణ అనంతరం మంజూరు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వృద్ధాప్య పెన్షన్ వయస్సు పెంచినట్టు గ్రామాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ చేయూత సైట్‌లో 65 ఏళ్ల వారికి వృద్ధాప్య పింఛన్‌లకు అర్హులుగా కనిపిస్తోంది. దీంతో గ్రామాల్లో 57 ఎళ్లు నిండిన వృద్ధులు అయోమయంలో పడిపోయారు. వయస్సు నిర్ధారణపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొందరికే అవకాశం

ప్రస్తుతం పింఛన్ల మంజూరుకు కొందరికి మాత్రమే ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వారు మరణిస్తే పింఛన్‌దారు భార్య లేదా భర్తకు అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ పొందుతూ దివ్యాంగులై ఉన్న వారికి వికలాంగుల కింద మారుస్తున్నారు. దివ్యాంగుల పెన్షన్ పొందుతూ మరణించిన వారి పింఛన్‌ను వృద్ధాప్యం కింద అధికారులు మార్చడం లేదు.

దరఖాస్తు చేసినా రాలే..



నా భర్త వికలాంగుల పింఛన్ తీసుకుంటూ రెండేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి భర్తది మార్చి వితంతు పింఛన్ మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ప్రజావాణిలో కలెక్టర్‌కు దరఖాస్తు చేసినా నేటికీ మంజూరు చేయడం లేదు.

– చిర్ర వెంకటమ్మ, కేశంపేట గ్రామం

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..



నాలుగేళ్ల క్రితం భర్త చనిపోవడంతో వితంతు పింఛన్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఎన్నిసార్లు అధికారులను కలిసినా కొత్తగా మంజూరు చేయడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారడంతో కూలీ పనులకు వెళ్తూ పిల్లలను చదివిస్తున్నా.

– కదియాల రాధిక, కేశంపేట

ఆదేశాలు లేవు



పింఛన్ల కోసం ఎవరైనా దరఖాస్తు ఇస్తే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తీసుకుంటారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తాం. కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు.

– రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి, ఎంపీడీఓ, కేశంపేట

కారు అదుపుతప్పి.. వాగులో పడి

యువకుడి దుర్మరణం


నితీష్‌రెడ్డి (ఫైల్)

చేవెళ్ల: కల్వర్టు వద్ద కారు అదుపుతప్పి వాగులో పడడంతో ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లకు చెందిన గుడిపల్లి నితీష్‌రెడ్డి(27) వ్యవసాయంతో పాటు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. మూడేళ్ల క్రితమే ఆయనకు వివాహం జరిగింది. మంగళవారం రాత్రి వినాయక మండపాల వద్ద జరిగిన అన్నదానాలు, పూజలు, భజన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అర్ధరాత్రి వ్యవసాయ పొలాల వైపు పని నిమిత్తం వెళ్తుండగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కారు బురదలో జారడంతో చేవెళ్ల–పామెన లింక్‌రోడ్డుపై ఉన్న పెద్ద వాగు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. కారు ఎగిరి వాగులో పడడంతో యువకుడు అందులో ఇరుక్కుపోయారు. వాగులో నీరు కారులోకి రావటంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందారు. ఉదయం అటువైపు వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కారులో ఉన్న వ్యక్తిని బయటకు తీసి చూస్తే నితీష్‌రెడ్డిగా గుర్తించారు. యువకుడు మృతితో భార్య, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి నితీష్‌రెడ్డి బీజేపీ పార్టీలో చురుకుగా పనిచేసేవాడు. బుధవారం విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆలయ భూమిలో రోడ్డు లేదు


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుర్మసంఘం నాయకులు

ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వండి: కుర్మసంఘం

ఇబ్రహీంపట్నం రూరల్: బీరప్ప దేవాలయం భూమిలో రోడ్డు లేదని, ప్రహరీ నిర్మాణం చేయడానికి అనుమతి ఇవ్వాలని ఆ ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 31లో 1.10 ఎకరాల విస్తీర్ణం భూమి 1995లో ఆలయానికి కొనుగోలు చేశామని తెలిపారు. అనంతరం చుట్టూ ప్రహరీ నిర్మించామన్నారు. కానీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా అధికారులు కూల్చి వేశారని, అలా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ భూమిలో మరలా ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోరే జంగయ్య, బండ రాజు, బీరప్ప, బాలం భాస్కర్, యాదగిరి, శివకుమార్, ఐలయ్య, సతీష్, రవి, భిక్షపతి, మల్లేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మహాసభలో పాల్గొన్న నాయకులు

సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య

ఆమనగల్లు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.18 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కుసుమ మాధురికి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు పాండు, కార్యదర్శి పర్వతాలు, కోశాధికారి లక్ష్మణ్‌నాయక్, సభ్యులు భాగ్యనాయక్, దోద్యనాయక్, భాగ్య, కవిత, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మహాసభ నిర్వహించారు. మహాసభలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా పద్మ, అధ్యక్షురాలిగా రజియా బేగం, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరమ్మ, కోశాధికారిగా బేబి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు


ప్రవీణ్‌నాథ్ (ఫైల్)

పహాడీషరీఫ్: మేనమామ మందలించడంతో బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన దుర్గానాథ్ కొన్నేళ్ల క్రితం జల్‌పల్లికి జీవనోపాధి నిమిత్తం వలస వచ్చాడు. తల్లిదండ్రులు లేని అతని మేనల్లుడు ప్రవీణ్‌నాథ్(12) ఇతని వద్దే ఉంటాడు. తరచూ అల్లరి చేసే ప్రవీణ్‌ను మేనమామ గత నెల 31వ తేదీన రాత్రి మందలించాడు. ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. అతని ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై మంగళవారం రాత్రి దుర్గానాథ్ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్‌పై యువకుల దాడి

రహమత్‌నగర్: గణేశ్ నిమజ్జన యాత్ర సందర్భంగా హెడ్ కానిస్టేబుల్‌పై యువకులు దాడి చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి ఈఎస్‌ఐ విజయలక్ష్మీ ఆలయం వద్ద వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళుతున్నాయి. ఆ సమయంలో ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ యువకులు గొడవ చేస్తుండటాన్ని తన సెల్ ఫోన్‌లో రికార్డు చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు గణేశ్ మండప నిర్వాహకులకు ఆదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆరిఫ్ మృతదేహం వెలికితీత

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఆరీఫ్ మృతదేహన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బుధవారం వెలికి తీశారు. జీవితంపై విరక్తి చెంది ఆరీఫ్ అనే యువకుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆరీఫ్ మృతదేహన్ని వెలికి తీసిన అనంతరం రాజేంద్రనగర్ పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రోడ్డు ప్రమాదంలో ఆరీఫ్ కాలుకు గాయం కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

‘ఈ’ కుప్పలు!

రాష్ట్రంలో పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు



- తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నులు దాటిన ఈ–వేస్ట్
- 2024–25లో 1,19,187 మెట్రిక్ టన్నుల విడుదల
- ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా తర్వాత అత్యధికంగా మన రాష్ట్రంలోనే..
- రాష్ట్రంలో కేవలం 15 రీసైక్లింగ్ కేంద్రాలే
- పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో.. అంతకు రెట్టింపు వేగంతో ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు (ఈ–వేస్ట్) విడుదల అవుతున్నాయి. సెల్‌ఫోన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్, రిఫ్రిజిరేటర్, ఏసీ, ప్రింటర్లు ఇలా ప్రతి ఎలక్ట్రానిక్ ఉత్పత్తి వినియోగం తర్వాత వ్యర్థాలుగా మారుతున్నాయి. తెలంగాణలో తొలిసారిగా ఈ–వేస్ట్ లక్ష మెట్రిక్ టన్నుల మార్క్‌ను దాటింది. 2024–25లో 1,19,187 మెట్రిక్ టన్నుల ఈ–వేస్ట్ విడుదలయ్యాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అదే 2023–24లో 65,226 మెట్రిక్ టన్నుల ఈ–వేస్ట్ విడుదలైంది. అంటే ఏడాది కాలంలో రాష్ట్రంలో అదనంగా 53,961 మెట్రిక్ టన్నులు ఈ–వ్యర్థాలు విడుదలయ్యాయి.

- దేశంలో ఉత్తరప్రదేశ్, హరియాణా తర్వాత దేశంలో అత్యధిక ఈ–వ్యర్థాలు విడుదలవుతున్నది మన రాష్ట్రంలోనే. తెలంగాణలో అధికంగా ఈ–వేస్ట్ విడులయ్యేది హైదరాబాద్ నుంచే. గత ఐదేళ్లలో నగరంలో ఉత్పత్తి అయ్యే ఎలక్ట్రానిక్ వ్యర్థాల పరిమాణం గణనీయంగా పెరుగుతుందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

2017–18లో నగరంలో 33,425 మెట్రిక్ టన్నుల ఈ–వ్యర్థాలు ఉత్పత్తి కాగా.. ఇప్పుడవి 50,835 మెట్రిక్ టన్నులకు పెరిగాయి.

ఈ–వేస్ట్ ప్రాసెసింగ్..

దేశంలో ఈ–వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం 13.97 మెట్రిక్ టన్నులు కాగా.. ఇందులో తెలంగాణ వాటా 8.5 శాతం. ప్రాసెసింగ్ వృద్ధిలో ఉత్తరప్రదేశ్ తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉంది. 2021–22 నుంచి ఈ–వేస్ట్ ప్రాసెసింగ్ మూడు రెట్లు వృద్ధి చెందుతోంది. ఐటీ సంస్థల కార్యకలాపాలు, పెరుగుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం, చురుకైన ఈ–వేస్ట్ నిర్వహణ విధానాలు ప్రాసెసింగ్ వృద్ధికి ప్రధాన కారణాలు. 2021–22లో 42,297 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ప్రాసెసింగ్ కాగా.. గత ఆర్థిక సంవత్సరానికి 1.19 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. అయితే రాష్ట్రంలో కేవలం 15 రీసైక్లింగ్ కేంద్రాలే ఉన్నప్పటికీ.. ప్రాసెసింగ్‌లో ఈ స్థాయిలో వృద్ధి నమోదు కావడం గమనార్హం.

అత్యధిక ఈ–వేస్ట్ రీసైక్లింగ్ కేంద్రాలున్న రాష్ట్రాలివీ

రాష్ట్రం	కేంద్రాల సంఖ్య
ఉత్తర్‌ప్రదేశ్	82
కర్ణాటక	45
మహారాష్ట్ర	43
హర్యానా	32
గుజరాత్	29
తెలంగాణ	15
తమిళనాడు	13
రాజస్థాన్	10

ప్రజారోగ్యంపై ప్రభావం..

ఈ–వ్యర్థాలు ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రభావం చూపిస్తుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం వంటి రసాయన పదార్థాలు ఉంటాయి. వీటిని సరిగా నిర్వీర్యం చేయకుండా పారేస్తే.. గాలి, నీరు, నేల కలుషితం అవుతాయి. ఈ కలుషితాలతో శ్వాసకోశ వ్యాధులు, నాడీ సంబంధిత రుగ్మతలు, దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులపై ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంద ని వారు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా, కఠినంగా అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

కార్మిక హక్కులను కాలరాయొద్దు


సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్
- కందుకూరులో యూనియన్ సర్వసభ్య సమావేశం

కందుకూరు: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో అమలవుతున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలు సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.కవిత అన్నారు. మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి ఫంక్షన్ హాల్‌లో బుధవారం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికుల హక్కులను కాల రాశారన్నారు. ఈ విషయమై కార్మికులు ఆందోళనలు చేయకుండా భయపెడుతున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు మందలించినా కేంద్రం తీరు మారడం లేదని అసహనం వ్యక్తంచేశారు. ఎర్ర జెండా పోరాటంతో ఎనిమిది గంటల పని విధానం అమలులోకి రాగా, దాన్ని తుంగలో తొక్కి 12గంటలు అమలు చేస్తున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీ కన్వీనర్‌గా బుడ్డీరపు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక, ఆశ, వీఓఏ, బీసీడబ్ల్యూ, మధ్యాహ్న భోజన, ఎఫ్ఏల, భగీరథ, ఆర్టీసీ, భవన నిర్మాణ, పంచాయతీ తదితర కార్మిక సంఘాల నాయకులు అంకగళ్ల కుమార్, శ్రీలత, సరస్వతి, బండి సత్తయ్య, పోల్కం శ్రీరాములు, కె.శ్రీనివాస్, రసింహ, లక్ష్మణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా ఇవ్వండి



నిరసన వ్యక్తం చేస్తున్న యాదయ్య తదితరులు

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

మంచాల: రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రాజ్యమని గొప్పలు చెప్పుకొని ప్రభుత్వాలు వారి బాధలను పట్టించుకోవడం లేదన్నారు. రైతాంగ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాగుడు మూతలు ఆడడం సరైంది కాదన్నారు. యూరియా అందించి అండగా నిలవాలన్నారు. వర్షాకాలం రైతాంగం పంటలు సాగు చేసే సమయంలో కొరత విధించడం ఎంత వరకు సమంజసం కాదన్నారు. వ్యవసాయ పనులు మానేసి రైతులు యూరియా కోసం రోజుల తరబడి క్యూలో నిరీక్షించడం దారుణన్నారు. ఇప్పటికైనా యూరియా నిల్వలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, యాదయ్య, జంగయ్య, లెనిన్, ఐలయ్య, వినోద్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో పీసీసీ చీఫ్

బడంగ్‌పేట్: ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుడిని బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ దంపతులను శాలువాతో సన్మానించి, వినాయకుడి లడ్డూను బహూకరించారు. వీరివెంట ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.


బాలాపూర్ గణనాథుడికి పూజలు చేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ దంపతులు

మహిళ వద్ద గంజాయి పట్టివేత..!

శంషాబాద్: మహిళా ప్రయాణికురాలి వద్ద భారీ ఎత్తున గంజాయి పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి… ఈ నెల 1న రాత్రి ఇండిగో విమానంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి కదలికలను అనుమానించిన అధికారులు ఆమె లగేజీని తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ దాదాపు రూ.3 కోట్లు ఉండవచ్చునని అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. అయితే గంజాయి పట్టివేతపై సంబంధిత వర్గాలు అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని వెల్లడించకపోవడం గమనార్హం.

గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలి అరెస్టు..

సనత్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలిని సనత్‌నగర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫతేనగర్ ఎల్‌బీఎస్‌నగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి విక్రయిస్తున్న షేక్ జతీస్ బీ (70) అనే వృద్ధురాలు గంజాయి విక్రయిస్తున్నట్లుగా గుర్తించి, ఆమె ఇంట్లో సోదా చేయగా 430 గ్రాముల గంజాయి లభ్యమైంది. ధూల్‌పేట్ నుంచి గంజాయిని తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణతో వెల్లడైంది. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గణేశ్ లడ్డూల చోరీ.. ఇన్‌స్టాలో పోస్ట్!

ఆదిబట్ల పీఎస్‌లో ఏడుగురిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: మండపాల్లోని గణేశుడి లడ్డూలు చోరీ చేసి, తిన్న ఏడుగురు యువకులపై పోలీసు కేసు నమోదైంది. ఆదిబట్ల ఎస్ఐ సైదయ్య కథనం ప్రకారం.. ఉపాధి నిమిత్తం మన్నెగూడ ప్రాంతంలో నివాసం ఉంటున్న సాయితేజ, శివకుమార్ వినాయకుడి లడ్డూలను చోరీ చేసి, తింటే మంచి జరుగుతుందని నమ్మి రాత్రి వేళ మన్నెగూడలోని ఎన్ఎస్ఆర్‌నగర్, మహోనియా ఆస్పత్రి వెనకాల, ఎంఎంకుంట ప్రాంతాల్లోని పలు వినాయక విగ్రహాల చేతుల్లో ఉన్న లడ్డూలను దొంగిలించారు. అబ్బు, ప్రవీణ్, రాహుల్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లతో కలిసి లడ్డూలను తినేశారు. అంతటితో ఆగకుండా లడ్డూలు చోరీ చేసిన సమయంలో తీసుకున్న వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఉదయాన్నే లడ్డూలు లేకపోవడాన్ని గమనించిన నిర్వాహకులకు ఇన్‌స్టాలో వీరు షేర్ చేసిన వీడియోలు కనిపించడంతో, నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

ఇబ్రహీంపట్నంరూరల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. రావిర్యాల, నాదర్‌గుల్ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సనత్‌నగర్: నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళ మెడలోని 1.5 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీకి చెందిన కడారి రమాదేవి ఈ నెల 1న సాయంత్రం స్థానిక నెహ్రూ పార్కు సమీపంలోని గణేష్ మండపానికి వచ్చింది. రాత్రి ఇంటికి తిరిగి వెళుతుండగా సాయిబాబా ఆలయ సమీపంలో బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని 1.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన వ్యక్తి స్కైబ్లూ కలర్ జర్కిన్ ధరించినట్లు బాధితురాలు పేర్కొంది.

బైక్ అదుపుతప్పి ఉద్యోగి మృతి

హస్తినాపురం: బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడిన సాఫ్ట్‌వేర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక హైకోర్టు కాలనీకి చెందిన దుర్గంపూడి అంజిరెడ్డి(43) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను బైక్‌పై వెళుతుండగా పనామాచౌరస్తా సమీపంలోని మాక్స్ విజన్ ఐ ఆసుపత్రి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఆయన్ని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు గోపాలకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఆరువేల మందితో బందోబస్తు

- వినాయక నిమజ్జనాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి


నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

మూసాపేట: సైబరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన కూకట్‌పల్లిలోని ఐడీఎల్ రంగధాముని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 6 వేల మంది పోలీసులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన 700కు పైగా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. రాబోయే మూడు రోజుల్లో వినాయక నిమజ్జనాలు భారీ ఎత్తున జరగనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చివరి రోజు నిమజ్జన ఏర్పాట్లపై ఇప్పటికే అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసినట్లు తెలిపారు. భక్తులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసులతో గస్తీ నిర్వహిస్తూనే సీసీటీవీల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాలానగర్ జోన్ డీసీపీ సురేష్‌కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్, కూకట్‌పల్లి సీఐ కె.వి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో టోకరా

నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కర్ణాటకకు చెందిన ప్రతాప్ కేసరి ప్రధాన్ బెంగళూరులోని తిరుమలశెట్టిహళ్లిలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కస్టమర్లకు పొదుపు, కరెంట్ ఖాతాలు తెరవడం, కస్టమర్లతో సంబంధాలు నిర్వహించడం అతడి బాధ్యత. ఈ క్రమంలో కస్టమర్లకు కమీషన్ ఆశ చూపించి, వారి నుంచి ఖాతా వివరాలను తీసుకుని వాటిని సైబర్ నేరగాళ్లకు చేరవేస్తూ అక్రమంగా డబ్బు సంపాదించేవాడు. వారు ఆయా ఖాతాలను సైబర్ నేరాలు, మోసాలకు వినియోగించేవారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన మహిళకు గత జులైలో సైబర్ నేరగాడు ప్రదీప్ సావంత్ అనే వ్యక్తి ఫోన్ చేసి, ముంబైలోని అంధేరి ఈస్ట్ పోలీసు అధికారిగా పరిచయం చేసుకున్నారు. బాధితురాలి బ్యాంక్ ఖాతా నుంచి అనధికారికంగా లావాదేవీలు జరిగాయని, మనీలాండరింగ్ కేసు నమోదైందని ఆమెను భయభ్రాంతులకు గురి చేశారు. ఆర్‌బీఐ, సీబీఐ, ఈడీ అధికారులుగా నటిస్తూ బాధితురాలిని ఏకంగా ఆరు గంటల పాటు వీడియో కాల్‌లో విచారించారు. వాట్సాప్ ద్వారా నకిలీ గుర్తింపు కార్డులు, అరెస్టు వారెంట్లను పంపించి బాధితురాలిని భయపెట్టారు. ఆర్‌బీఐ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ రాగానే 24 గంటల్లోపు డబ్బును తిరిగి చెల్లిస్తామని నమ్మించి, బాధితురాలి ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి రూ.10.02 లక్షలు కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో నిందితుడు ప్రతాప్ కేసరి ప్రధాన్‌ను అరెస్టు చేశారు. అతడిపై ఇప్పటికే దేశవ్యాప్తంగా ఏడు కేసులు ఉండగా.. తెలంగాణలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు.